క్లుప్తంగా

కుమార సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేకాలంకరణలో స్వామివారు

బిక్కవోలు: స్థానిక కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక అలంకరించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు అన్నసమారాధన చేశారు.

రేపు మండల పరిషత్ సాధారణ సమావేశం

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం గురువారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి.వీర సాయిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు, మండలంలోని ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల పూర్తి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

పెదపూడిలో రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పెదపూడి: స్థానిక శ్రీసత్యసాయి సేవా కేంద్రం ప్రాంగణంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సత్యసాయి సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వైద్యులు ఈ శిబిరంలో సేవలు అందిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే శిబిరంలో కంప్యూటర్ ద్వారా చత్వారం, తలనొప్పి పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. అవసరమైన వారికి ఆపరేషన్ కూడా చేయిస్తారని తెలిపారు.

అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ


కొంకుదురులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో అతిసార వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు ఈశాజ్యోతి మాట్లాడుతూ అతిసార వ్యాధి చిన్న పిల్లలకు సోకే అవకాశం ఉందన్నారు. అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరించారు. వ్యాధిలో సోకిన వారికి ఉచిత మందుల పంపిణీ చేశారు.

ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు

కోరుకొండ: సాగునీటి పథకాలు, కాలువల ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు నిర్వహిస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కోరుకొండ మండలం గాదరాడ సచివాలయంలో మంగళవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయనను సాగు నీరు కావాలని అడిగారు. ఎమ్మెల్యే స్పందిస్తూ, ఆయా పథకాలకు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అందని ఆడబిడ్డ నిధి

- కూటమి వచ్చి ఏడాదైనా అమలు చేయని పథకం
- నెలకు రూ.1,500 ఇస్తామన్న నేతలు
- నియోజకవర్గంలో 19 నుంచి 59 వయస్సు గల మహిళలు 92,114 మంది
- ఎన్డీఏ హామీ నెరవేర్చాలంటున్న ఆడపడుచులు



పెదపూడి: ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే 19 నుంచి 59 ఏళ్ల వయస్సు గల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఆడబిడ్డ నిధి పథకం అమలుకు నోచుకోలేదు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించడంతో మహిళలందరూ మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేయడంలో ఘనుడు అని చెప్పడానికి ఇదోక నిదర్శనంగా నిలుస్తుంది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఆడబిడ్డకు ప్రతి నెల రూ.1500 బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినప్పటికీ పథకం అమలు చేయకపోవడంతో ఆడపడుచులు నిరాశకు గురయ్యారు.

గతంలో మహిళలకు పెద్దపీట

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళల చేతికి చేరిన నగదు వృథా కాకుండా ఇంటి అవసరాలకే ఉపయోగపడుతుందని భావించి అనేక పథకాల నగదు మహిళల ఖాతాకే జమ చేశారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత లాంటి అనేక ముఖ్యమైన పథకాలన్నిటినీ మహిళల అకౌంట్లకే జమ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయినా ఆడబిడ్డ నిధికి సంబంధించిన ప్రస్తావనే లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. 19 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500 లు చొప్పున ఏడాదికి రూ.18 వేలు చెల్లించాల్సి ఉంది.

మండలం	19 నుంచి 59 ఏళ్ల మహిళలు	ఏడాది బకాయిల అంచనా
అనపర్తి	24,824	44,68,32,000
బిక్కవోలు	23,916	43,04,88,000
రంగంపేట	19,422	34,95,96,000
పెదపూడి	23,952	43,11,36,000
మొత్తం	92,114	165,80,52,000

అనపర్తి నియోజకవర్గంలో..

అనపర్తి నియోజకర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 19 నుంచి 59 ఏళ్ల వయస్సులో ఉన్న మహిళలు సుమారు 92,114 మంది ఉన్నారు. ఆడబిడ్డ నిధి తమకు ఎప్పుడు చెల్లిస్తారని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మొత్తాన్ని ఒకే విడతలో చెల్లించడంతో పాటు రాబోయే రోజుల్లో నెల నెలా రూ.1500 చెల్లించాలని మహిళలు కోరుతున్నారు.

ప్రభుత్వానిది వంచన



కూటమి ప్రభుత్వం మహిళలను వంచనకు గురి చేసింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచినా ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయకపోవడం మహిళలను మోస చేయడమే. ఇప్పటికైనా ప్రభుత్వం పథకం అమలు చేసి మహిళలపై చిత్తశుద్ధిని నిరుపించుకోవాలి.

– కడియాల భూలక్ష్మి, పెదపూడి గ్రామం

ఎప్పుడిస్తారో చెప్పాలి?



కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తుందో వెంటనే చెప్పాలి. హామీ ఇచ్చి ఏడాది కాలం దాటిపోయింది. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం పథకాన్ని అమలు చేయాలి. దీంతోపాటు ఏడాది బకాయిలు కూడా వెంటనే చెల్లించాలి.

– ఎస్.పద్మావతి, పెదపూడి గ్రామం

సిఫారసు చేసిన ఎరువులతో అధిక దిగుబడి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శేఖర్

రాజానగరం: భూసార పరిరక్షణలో భాగంగా పంటలకు సిఫారసు చేసిన ఎరువులను వినియోగిస్తే.. భూమి స్వరూపం దెబ్బతినకుండా, పర్యావరణ సమతుల్యతను కాపాడుకుంటూ నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని రాజమహేంద్రవరంలోని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ డి.శేఖర్ అన్నారు. దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రంలో కోనసీమ జిల్లాలోని 15 వ్యవసాయ సహకార పరపతి సంఘాల పరిధిలోని డీలర్లకు సర్టిఫికెట్ కోర్సులో ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం భూసారం పెంపుదలకు సమర్థ ఎరువుల వినియోగం అనే అంశంపై తరగతులు జరిగాయి. కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు మాట్లాడుతూ, ఎరువులు వాడే విధానం, సేంద్రియ ఎరువుల వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో బదిలీలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకుడి కార్యాలయ పరిధిలో పలు బదిలీలు జరిగాయి. కడియం వ్యవసాయాధికారిగా పద్మలత, రాజానగరం వ్యవసాయాధికారిగా కల్యాణ సూర్యకుమార్, పీఏ టు ఏడీఏగా కె.సూర్యరమేష్ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా కె.సురేష్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్‌గా సుందరి నియమితులయ్యారు.

ట్రాఫిక్ బారికేడ్ల అందజేత

కంబాలచెరువు: నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ మంగళవారం పది బారికేడ్లను అందజేసింది. వాటిని ఏఎస్పీ ఎంబీఎస్ మురళీకృష్ణ సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.రమేష్‌బాబు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.మురళీకృష్ణ, డాక్టర్ పి.హారిక ప్రియంవద, డాక్టర్ ఆర్.స్వాతి నిషిత, అజయ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విచక్షణా రహితంగా కూల్చివేసిన ఇళ్ల పరిశీలన


కొమరిపాలెంలో తమ బాధను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి వివరిస్తున్న బాధితుడు శ్రీనివాసరెడ్డి

బిక్కవోలు: కొమరిపాలెంలో ఇటీవల షాపులను కూల్చిన స్థలాలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలంలోని కొమరిపాలెం గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటన స్థానికులను తీవ్ర ఆందోళనకు గురి చేశాయన్నారు. గతంలో ఎప్పుడూ నియోజకవర్గంలో కక్ష సాధింపు చర్యలు చోటు చేసుకోలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హయాంలో పలు చోట్లు విచక్షణా రహితంగా ఇళ్లు కూల్చడం, షాపులను ధ్వంసం చేస్తున్నారన్నారు. బిక్కవోలు, పందలపాక, రాజపాలెం, దోమాడ, పెదపూడి వంటి గ్రామాలలో ఇప్పటికే ఇళ్లు, హోటళ్లు, వ్యాపార సంస్థలపై దాడులు జరిగాయన్నారు. అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి పోలీసుల సాయంతో ప్రజల ఆస్తులను కూల్చడం వలన ప్రజల్లో భయాందోళనలు వ్యాపించాయని, ఈ చర్యల వెనుక స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మద్దతు ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. మాజీ జెడ్పీటీసీగా పని చేసిన పడాల రాము సెలవు రోజున అధికారులను రంగంలోకి దించి అర్ధరాత్రి ఈ చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యగా అభిప్రాయపడుతున్నామన్నారు. గ్రామస్తులు రాజకీయ ప్రత్యర్థుల ఆస్తులను లక్ష్యంగా చేసుకుని రాజకీయాన్ని వ్యక్తి గతంగా మార్చడం హేయమైన చర్య అని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రత్యేకంగా ఒక హోటల్ స్థలం విషయంలో కూడా కొన్ని సంవత్సరాలుగా ఉన్న స్థలాన్ని అక్రమంగా ఆక్రమణ స్థలంగా చిత్రీకరించి ఇల్లు తొలగించారు. హోటల్ ఉన్న ప్రాంతంలో గత 50–60 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా శ్రీనివాసరెడ్డి గారి కుటుంబ ,గ్రామంలో మంచి పేరు పొందారు. ఎలాంటి కోర్టు నోటీసులు లేకుండానే రూ.10 లక్షల విలువైన ఆస్తి నాశనం చేశారని, రౌడీ రాజ్యంగా మారిందన్నారు. మంచి ప్రభుత్వం అని చేప్పే చంద్రబాబు ఇదేనా ఆ పాలన అని ప్రశ్నించారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన ప్రతి ఒక్కరూ రానున్న కాలంలో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలోని వైఎస్సార్ సీపీ నాయకులు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, సత్తి నాగిరెడ్డి రాజా తదితరులు పాల్గొన్నారు.

నేటి ఉపాధ్యాయులకు రమ్యసుధ ఆదర్శం


అవార్డు గ్రహీత రమ్యసుధను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

రంగంపేట: ఉత్తమ పరిశోధనల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గుర్తింపు తెచ్చిన రమ్యసుధ నేటి ఉపాధ్యాయ లోకానికి ఆదర్శప్రాయమని బీజేపీ మండల అధ్యక్షుడు మైలవరపు సాయిరామ్ అన్నారు. మంగళవారం స్థానిక హైస్కూల్లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధ అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12, 13వ తేదీల్లో నేపాల్ దేశంలోని ఖాట్మండు ఎంఐటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన ఇన్నోవేటివ్ ప్రాక్టీస్ ఫర్ ఆక్సిలరేటెడ్ గ్రోత్ ఇన్ కామర్స్ హ్యూమానిటీస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆమె పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సెమినార్లో రమ్యసుధ రీ ఇన్వింటింగ్ టుమారో డ్రైవింగ్ గ్రోత్ త్రూ సైంటిఫిక్ ఇన్నోవేషన్ అనే పరిశోధన పత్రం సమర్పించగా దానికి ఉత్తమ పరిశోధన అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని రమ్యసుధను ఘనంగా సత్కరించారు. తనకు మంచి గుర్తింపునిచ్చిన పాఠశాలకు, సహచర ఉపాధ్యాయులకు, గ్రామ పెద్దలకు రమ్యసుధ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ నీలపాల త్రిమూర్తులు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండవిల్లి గుప్తా, మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు, ఆయిల్ ఫామ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల బుజ్జిబాబు, ఉపాధ్యాయులు జాకబ్, చార్లెస్, స్వాతికుమారి, వెంకటలక్ష్మి, సీఆర్ఎంటీ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా పండ్ల తోటల పెంపకం చేపట్టేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఉద్యాన శాఖ సిబ్బందితో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసక్తి ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మామిడి, జీడిమామిడి, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, బత్తాయి, కొబ్బరి, సపోటా, సీతాఫలం, కోకో వంటి 26 రకాల పండ్ల తోటల పెంపకానికి అవకాశం ఉందన్నారు. మూడేళ్ల నిర్వహణ ఖర్చులతో పెంపకం చేపట్టే రైతులకు ఒక్కొక్కరికీ పండ్ల తోటల రకాన్ని బట్టి ఎకరాకు రూ.68,103 నుంచి రూ.2,51,226 ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ నెల 25లోగా గ్రామ సహాయకులు లేదా పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీఓలకు దరఖాస్తులను అందజేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, మండల వ్యవసాయాధికారి కల్యాణ్ సూర్యకుమార్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ బాలరాజు, ఉద్యాన శాఖాధికారి నాగదేవిశ్రీ, ప్లాంటేషన్ మేనేజర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రం.. బీ కేర్‌ఫుల్ బ్రదరూ..


పేపర్‌మిల్లు వద్ద పెట్రోల్ బంక్ వైపు నుంచి కాతేరు వెళ్లే రోడ్డు దుస్థితి

రాజమహేంద్రవరం సిటీ: అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి పరాకాష్టే ఈ రహదారి దుస్థితి. కొద్దిపాటి చినుకులు పడితే.. ఇదిగో ఇలా చిత్తడిగా తయారవుతుంది ఈ రోడ్డు. నగరంలోని పేపర్‌మిల్లు నుంచి కాతేరుకు వెళ్లే రోడ్డు ఇది. మంగళవారం సాయంత్రం కొద్దిసేపు కురిసిన వర్షానికే ఇలాగైంది. ఈ రోడ్డులో ప్రయాణించిన వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలో రహదారుల నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో దీనిని చూస్తే అవగతమవుతుంది.

మారణకాండ ఆపాలి

ప్రకాశం నగర్: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండ ఆపాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జాంపేట ఆజాద్‌చౌక్ సెంటర్‌లో పాలస్తీనాకు సంఘీభావంగా సీపీఐ, సీపీఐ–ఎం, సీపీఐ–ఎంఎల్ నాయకులు నిరసర ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఐ–ఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.పవన్ మాట్లాడుతూ, ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో పాలస్తీనా ప్రజలు 55 వేల మందికి పైగా మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని తెలిపారు. పాలస్తీనా ప్రజలకు భారతదేశం సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు అందిస్తున్న సైనిక, భద్రత సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ–ఎంఎల్ నాయకుడు వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో అమాయకత్వం వల్లే అఘాయిత్యాలు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి ఆందోళన


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి

కంబాలచెరువు: సమాజంలో పిల్లల అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుని కొందరు వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, మోసపూరితంగా అక్రమ కార్యకలాపాలకు వాడుకుంటున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీతంపేటలోని పంతం సత్యనారాయణ ఎలిమెంటరీ స్కూల్‌లో మంగళవారం మంచి, చెడు స్పర్శలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, పిల్లల విషయంలో ఎవరూ హద్దులు దాటి ప్రవర్తించరాదని హెచ్చరించారు. పిల్లలు కూడా చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి కలిగి ఉండాలని, వివిధ విషయాలపై పరిజ్ఞానం పెంచుకోవాలని ఉద్బోధించారు. బాల్య వివాహ నిషేధ చట్టం–2006, బాల కార్మిక నిర్మూలన చట్టం–1986 తదితర వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నల్సా (పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవలు) పథకం–2024 ద్వారా తమ సంస్థ పిల్లలకు అందిస్తున్న న్యాయ సేవలను వివరించారు. పిల్లలకు ఎలాంటి న్యాయ సమస్యలు ఎదురైనా తమ సంస్థను సంప్రదించాలన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న భోజనాన్ని ఈ సందర్భంగా ఆమె పరిశీలించారు.

కన్నమాంబ దర్శనం.. భక్తజన పరవశం


ప్రత్యేకాలంకరణలో కన్నమాంబ పేరంటాలమ్మ వారు


వేంకటేశ్వరస్వామి, ఇతర వేషధారణలో కళాకారులు


గరగ నృత్యాలు చేస్తున్న కళాకారులు


అమ్మవారి చల్లఘటాలను ఊరేగిస్తున్న భక్తులు


ఆకట్టుకున్న శక్తి వేషధారణలు

- వైభవంగా మహోత్సవాలు
- పురవీధుల్లో చల్లఘటాల ఊరేగింపు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కన్నమాంబ పేరంటాలమ్మ వారి 127వ జాతర మహోత్సవాలు స్థానిక ఆల్కాట్‌తోట శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. శెట్టిబలిజ రామాలయం వద్ద నుంచి కన్నమాంబ పేరంటాలు అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి పూల గరగలు, సేవగరిడి, శక్తి వేషాలు గరగ నృత్యాలు, వేంకటేశ్వరస్వామి అలివేలు పద్మావతి వేషధారణలు, డీజేతో పాటు, బాణసంచా కాల్పులు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. తుదకు అమ్మవారి చల్లఘటాలను ఊరేగింపుగా రైల్వేస్టేషన్ సమీపంలో కన్నమాంబ అమ్మవారి ఆలయం వద్దకు తీసుకువెళ్లారు. అమ్మవారిని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దర్శించుకున్నారు.

జాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో టూటౌన్ ఇన్‌స్పెక్టర్ శివగణేష్, ఎస్సై, సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు.

నవ ధాన్యాల సాగుకు సమాయత్తం

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు


నవ ధాన్యాల సాగును పరిశీలిస్తున్న మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: రైతులు నవధాన్యాల సాగు ద్వారా తమ పొలాలను సారవంతం చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ మాధవరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రతి మండలంలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ ద్వారా భూమిని సారవంతం చేసుకునేందుకు పీడీఎంఎస్ కిట్లు సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని తొర్రేడు గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ, రైతులకు త్వరలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సాగు పరికరాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. ఇకపై ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి భీమరాజు అన్నారు. పశు వైద్యాధికారి ప్రసన్నకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు పీటర్, వేణుమాధవ్, ఉద్యాన, మత్స్య శాఖల అధికారులు, రైతులు మద్దుకూరి శ్రీనివాస్, దండమూడి రామచంద్రం, మల్లిన సతీష్, కొత్తపల్లి సత్యనారాయణ, తొర్రేడు వీఏలు ఎన్డీ శ్రీనివాస్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.